# ప్రేమ ఎంత మధురం!

**-- కనకదుర్గ**

"సంధ్యా, సంధ్యా, ఎక్కడున్నావమ్మా? కొంచెం సూదిలో దారం పెట్టియ్యి తల్లీ!" లక్ష్మమ్మగారు ఒక చేతిలో జాకెట్టు, రెండో చేతిలో సూదీ దారం పట్టుకుని వచ్చి వరండా మెట్లపై కూర్చున్నారు.

మనవరాలు సంధ్య బంగారుబొమ్మ! కొత్తపెళ్ళికూతురి కళ మరింత అందాన్నిచ్చిందేమో, గేటు దగ్గర నిల్చొని భర్త శ్రీనాథ్ కోసం ఎదురు చూస్తోంది. అమ్మమ్మ పిలుపు విని వెనక్కి తిరిగి,

"ఏం కావాలి అమ్మమ్మా?" అని అడిగి మళ్ళీ వీధిలోకి చూస్తూ నిల్చుంది. ఏ ఆటో వచ్చినా అందులోనుండి శ్రీనాథే దిగుతాడని ఆశ పడ్తుంది.

"ఇలా రా సంధ్యా! నాతో కూర్చో! నాకీ చిన్నపని చేసిపెట్టు తల్లీ. ఇంకొన్ని చమ్కీలు కుడితే ఈ జాకెట్టు పని పూర్తవుతుంది. తర్వాత చీర కట్టుకుని, బ్లౌజు వేసుకుని చూపిస్తే సంతోషిస్తాను." సంధ్య వచ్చి అమ్మమ్మ ప్రక్కన కూర్చుని సూదిలో దారం పెట్టి ఇచ్చింది.

"సంధ్యా! నీ చోద్యం కానీ ఇంటిముందరకు వచ్చినవాడు లోపలికి రాకుండా వెళ్ళిపోతాడా? కాళ్ళు నొప్పెట్టలా? ఎంతసేపు అలా నుంచుంటావు?" అని అడిగింది అమ్మమ్మ సంధ్య తల నిమురుతూ.

"పో అమ్మమ్మా నీకంతా వేళాకోళమే! ఐదుగంటలకల్లా వస్తానన్నాడు, ఇంత లేటయిపోయింది. రోజూ ఎన్ని యాక్సిడెంట్లు అవుతుంటాయో! తల్చుకుంటేనే భయమేస్తుంది.!" అని అమ్మమ్మ ఒళ్ళో తలపెట్టుకు పడుకుంది.

"పిచ్చి తల్లీ! అప్పుడే మీ ఆయనమీద ఎంత ప్రేమే అమ్మా! ఇక కాపరానికి వెళ్తే మమ్మల్ని గుర్తు పెట్టుకుంటావా? నీకిష్టమని బ్లూ కలర్ చీరమీద ఇన్ని రోజులు కష్టపడి పూసలతో, చమ్కీ వర్క్ చేసాను. ఈ అమ్మమ్మ గుర్తుంటుందా నీకు?"

"నీతో నేను మాట్లాడనమ్మమ్మా! ఏం మాట్లాడినా అట్లాగే అంటావ్. మా బంగారు అమ్మమ్మని మర్చిపోతానా నేను"

"ఏమో తల్లీ, మొన్నటిదాకా పెళ్ళిచేసుకోనని మొండికేయటం, కట్నం తీసుకునేవాడిని అసలే చేసుకోను అని నువ్వు పట్టు పట్టడం, నాడబ్బు, నాఇష్టం వచ్చినట్టు చేసుకుంటాను, నీకెందుకని తండ్రీ కూతుళ్ళిద్దరూ గొడవపడలేదూ? నువ్వు కవితలు, కథలు, కట్నాలకు వ్యతిరేకంగా వ్యాసాలు రాస్తుంటావని శ్రీనాథ్ మీ అన్నయ్య ద్వారా విని, అవి చదివి ముగ్ధుడైపోయి మా బంగారుబొమ్మని ఎగరేసుకుపోలేదూ?"

అంటూ సంధ్య తల్లి వసంత టీ పట్టుకు వచ్చి తల్లికిచ్చి తను కూడా వాళ్ళ పక్కనే కూర్చుంది టీ త్రాగుతూ.

"అమ్మా నువ్వు కూడా మొదలుపెట్టావా?" అని తల బాదుకుంది సంధ్య!

ఆటో చప్పుడవ్వడంతో చెంగున లేచి గేటువైపు పరిగెత్తింది.

వసంత, లక్ష్మమ్మగారు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

శ్రీనాథ్ ఆటో అతనికి డబ్బులిచ్చేసి సంధ్యవైపు చూసి చిరునవ్వుతో 'హాయ్' అన్నాడు. సంధ్య శ్రీనాథ్ని చూసి ఏవో ఆలోచన్లోకి వెళ్ళిపోయింది. క్రీమ్ కలర్ షర్ట్, బ్లాక్ పాంట్ టక్ చేసుకుని, కొద్దిగా ఉంగరాలు ఉన్న జుట్టు గాల్లో ఎగురుతుంటే చాలా హాండ్ సమ్ గా అన్పించాడు.

'హల్లో! ఏ లోకంలో ఉన్నావ్!' అని శ్రీనాథ్ పిలవడంతో సిగ్గుపడుతూ 'ఐ యామ్ సారీ! హాయ్, అవునూ ఇంత లేటయిందేమిటి? నేనెప్పట్నుండి......' మాట పూర్తవకముందే శ్రీనాథ్, 'సారీ సంధ్యా, విపరీతమైన ట్రాఫిక్, విసుగొచ్చేసింది. ఒకచోటయితే దిగేసి నడుచుకుంటూ వచ్చేద్దామనుకున్నాను కూడా.....'.

'అబ్బా! అన్నీ మాటలే, అంత దూరం నడిచేద్దామనే అనుకున్నారా?'

'అబ్బే! ఎక్కడో కాదు. ఇక్కట్నుండి ఐదు నిమిషాల దూరంనుండే వద్దామనుకున్నానండి!' అన్నాడు శ్రీనాథ్ నవ్వుతూ.

'హో సారీ మర్చిపోయి మీరు అన్నానా? అయినా టైమ్ పట్టదా 'నువ్వు' అని పిలవడానికి....'

'సరే, అప్పటిదాకా నేను నిన్ను 'మీరు' అనే పిలుస్తాను' అన్నాడు శ్రీనాథ్.

'హమ్మో! వద్దు మహానుభావా! మా అమ్మమ్మ నన్ను చంపేస్తుంది వేళాకోళం చేసి!'.

ఇద్దరూ నవ్వుకుంటూ లోపలికి వచ్చారు. వసంత అప్పటికి టీ రెడీ చేసి ఒక ప్లేటులో కారప్పూస, మడతకాజాలు తెచ్చిపెట్టింది. పారిజాతం చెట్టుదగ్గర టీపాయ్, కుర్చీలు వేసివున్నాయి. వసంత అవి అక్కడపెట్టి, శ్రీనాథ్ని పలకరించి లోపలికి వెళ్ళిపోయింది.

సంధ్య టీ కప్పు ఒకటి శ్రీనాథ్కిచ్చి తను ఒకటి తీసుకుంది.

'ఏయ్ సంధ్యా నీకాలేజీ ఇంటర్వ్యూ ఎలా జరిగింది?'

'నామొహంలా జరిగింది'.

'గుడ్' అన్నాడు కారప్పూస నోట్లో వేసుకుంటూ.

'ఏమిటీ నీమొహం అంత బాగా జరిగిదన్నమాట!'

'చాల్లే గొప్ప! ఇంటర్వ్యూ బాగానే చేసాను. ఒక వారం రోజుల్లో తెలుస్తుంది.'

'గ్రేట్! నాకు తెల్సు నీకే వస్తుందని.'

టీ తాగడం అయ్యాక కప్పులు తీసుకుని లోపలికి వెళ్ళింది. వసంత, అమ్మమ్మ ఇద్దరూ ఏదో మాట్లాడుతున్నవారు సంధ్యను చూడగానే ఆపేసారు.

'ఏం మాట్లాడుతున్నారు? మళ్ళీ నాగురించేనా?' అని నిలదీసింది.

'ఏం లేదమ్మా, పెళ్ళికిముందు ఆ అబ్బాయి వచ్చి బయటకు ఎక్కడికైనా వెళ్ళి మాట్లాడుకుందాం అనగానే, ఇంట్లో పెద్దవాళ్ళున్నారు, వాళ్ళని ఓ మాట అడగాలని కూడా ఆలోచించకుండా రయ్యిమని వెళ్ళిపోయావ్ గుర్తుందా?.'

'గుర్తుంది. అయినా ఇంకా ఎన్నాళ్ళు సాధిస్తారు నన్ను?' అని బయటకు వెళ్తూ ఆ రోజు శ్రీనాథ్, తనూ ట్యాంకుబండుకి వెళ్ళడం, ఎన్నో రోజులు పరిచయం ఉన్నవారిలా మాట్లాడుకోవడం, ఇద్దరి అభిప్రాయాలు, ఇష్టాలు చాలావరకు ఒకటేనని తెలియడానికి ఎక్కువసేపు పట్టలేదు. సంధ్య తను విన్నది అడిగింది శ్రీనాథ్ని.

'మీకు చాలా అందమైన అమ్మాయి కావాలని కండిషను పెట్టారట, మరి నేనెలా మీకు....,'

'ఇవ్వన్నీ మధ్యవర్తులు చేరవేసే మాటలు. అయినా నీకేమయింది? నువ్వు అందంగా లేవా?'

శ్రీనాథ్ అంత డైరెక్టుగా అడిగేవరకు సిగ్గుపడిపోయింది సంధ్య.

పెళ్ళయినా శ్రీనాథ్కి ఆఫీసులో విపరీతమైన పనివత్తిడి వుందని, అది అయిపోగానే తీసుకెళ్తామన్నారు సంధ్యని కాపురానికి. ఇంతలో ఆషాడమాసం రావడంతో అంతా కలిపి నాల్గు నెలలయ్యేలా వుంది. కానీ, ప్రతివారం శుక్రవారం సాయంత్రం సంధ్య వాళ్ళింటికి వచ్చి సోమవారం ప్రొద్దున్నే ఆఫీసుకు వెళ్ళేవాడు. మళ్ళీ శుక్రవారం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడ్డం, రాగానే ఎప్పుడెప్పుడు సంధ్యని చూడ్డానికి వెళ్దామా అని ఎంత ఆత్రపడేవాడో, అక్కడ సంధ్య కూడా శ్రీనాథ్ రాకకై అలాగే ఎదురు చూసేది. ఇద్దరికి అప్పుడు 'ప్రేమంటే ఇదేనా?' అని అన్పించేది.

శ్రీనాథ్ కూడా తనకి నచ్చే అమ్మాయి దొరికేవరకు పెళ్ళి చేసుకోవద్దనుకున్నాడు. తల్లితండ్రుల బలవంతంపై సంధ్యను కలుసుకోవడం జరిగింది. సంధ్య అందరిలా కాకుండా సింపుల్గా వుంది. గ్లోబలైజేషన్ తో వచ్చిపడిన కాస్మటిక్స్ తో అమ్మాయిల, అబ్బాయిల వేషభాషల్లో మార్పు వచ్చింది. శ్రీనాథ్కి ఆ మార్పు నచ్చక సింపుల్ గా వుండిపోయాడు. సంధ్యని చూడగానే వెన్నెట్లో చందమామని చూసినట్టుగా అన్పించింది. పెద్దకళ్ళతో, ఏ మేకప్ లేకుండా, సొట్టలు పడే బుగ్గలతో ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుంటుంది.

శ్రీనాథ్ మాగజైన్ చూస్తూ ఆలోచిస్తున్నాడు వారిద్దరి గురించి. ఇంతలో సంధ్య వచ్చి భోజనానికి రమ్మంది. బట్టలు మార్చుకుని భోజనానికి వెళ్ళాడు. మామగారు శ్రీనివాసరావు గారు సరదాగా ఉంటారు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించారు. రాత్రి 10:30 అయ్యింది. ఇంట్లో అందరూ నిద్దరకు సిద్ధమవుతున్నారు. శ్రీనాథ్, సంధ్య మాత్రం ఆ రాత్రి మాట్లాడుకోవాల్సిన మాటలు తల్చుకుంటూ ఇద్దరూ బయట కూర్చున్నారు.

పున్నమి రాత్రి, కొబ్బరి చెట్లోంచి చందమామ తొంగి చూస్తున్నాడు పడుచుజంటని. మల్లెలు, పారిజాతాలు పోటీపడి సువాసనలు వెదజల్లుతున్నాయి. సంధ్య తను ఆ వారం చదివిన 'మాక్సిమ్ గోర్కి' బాల్యం గురించి చెప్పింది.

శ్రీనాథ్ తను ఎప్పుడు ఆ పుస్తకాలు కొన్నాడు, ఎప్పుడు చదివాడు, తన కిష్టమైన విషయాలు చెప్పాడు.

శ్రీనాథ్ కోరికపై సంధ్య కాసేపు గిటారుపై చక్కటి పాటలు వాయించింది. రాత్రి చాలా సేపయింది. చల్లగాలి వీస్తోంది. ప్రక్కన ప్రియాతిప్రియమైన నెచ్చెలి. శ్రీనాథ్, సంధ్య చెయ్యి పట్టుకుని మల్లెచెట్టు పక్కన వున్న మెట్లపై కూర్చున్నాడు. ఝామ్మని చలిగాలి ఎక్కువవ్వడంతో చెలి వడిలో వెచ్చదనంకోసం సంధ్యచుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకున్నాడు. సంధ్య తల శ్రీనాథ్ ఎదలో దాచుకుంది. ఇద్దరి వెచ్చటి ఊపిరి శరీరాలకు తగుల్తోంది. శ్రీనాథ్ సంధ్య మొహం చేతుల్లోకి తీసుకుని ఆల్చిప్పల్లాంటి కళ్ళపై వెచ్చటి ముద్దు పెట్టాడు. సంధ్య చుబుకం పట్టుకుని అదురుతున్న అధరాలపై తన అధరాలతో మధువు గ్రోలుతూ వుండిపోయాడు చాలాసేపు. ఇంట్లో అలికిడి కావడంతో సంధ్య లేచి ఇంట్లోకి పరిగెత్తింది.

మర్నాడు శ్రీనాథ్ మామగారికి ఫోన్ చేయడం, ఆషాడం గంగలో కలిసిపోవడం, అమ్మ, అమ్మమ్మా ముసిముసినవ్వులు నవ్వు కోవడంజరిగింది. రెండ్రోజుల్లో ఇద్దరూ సిమ్లాలో ప్రేమలో మునిగిపోయారు.

*****